క్లుప్తంగా

వ్యాపార నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యం


అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య

గుంతకల్లుటౌన్: డిగ్రీ విద్యార్థుల్లో వ్యాపార నైపుణ్యాలతో పాటు సృజనాత్మకశక్తిని వృద్ధి చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ అనే కార్యక్రమం ప్రారంభించిందని ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మయ్య అన్నారు. గురువారం కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో వ్యాపార వాణిజ్య అంశాలకు సంబంధించి శిక్షణ ఇవ్వడమే ఈ కార్యక్రమ ముఖ్య లక్ష్యమన్నారు. నలుగురు విద్యార్థులు ఒక టీమ్‌గా ఏర్పడి వైఎఫ్ఎస్ఐ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రవిశంకర్ శర్మ, యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ కోఆర్డినేటర్లు జాకీర్, శివకుమార్, అధ్యాపకులు గోపి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్లో సీట్ల సంఖ్య పెంచాలి

గుత్తి: మోడల్ స్కూల్లో సీట్ల సంఖ్యను పెంచాలని వైఎస్సార్ సీపీ ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గుత్తిలోని కర్నూల్ రోడ్డులో ఉన్న మోడల్ స్కూల్‌ను ఐటీ వింగ్ నాయకులు జ్ఞానేశ్వరరెడ్డి, విజయ కుమార్, నాగధరణి కుమార్‌తో కలసి గురువారం ఆయన మోడల్ స్కూల్‌ను సందర్శించారు. సీట్ల సంఖ్యను పెంచాలని ప్రిన్సిపాల్ ప్రతిష్ఠ కుమారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మోడల్ స్కూల్లో దరఖాస్తు చేసుకున్న 20 శాతం మంది విద్యార్థులకు కూడా సీట్లు రాలేదన్నారు. సీట్ల సంఖ్యను పెంచాలని లేదా అదనంగా గుత్తికి మరో మోడల్ స్కూల్‌ను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

రీ సర్వే పరిశీలన


మట్లగొందిలో రీసర్వేను పరిశీలించిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్

శింగనమల: మండలంలోని మట్లగొంది, ఆకులేడు, లోలూరు, శింగనమల రెవెన్యూ గ్రామాల్లో గురువారం రీ సర్వేను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్ పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేసి, తహసీల్దార్ శేషారెడ్డితో వివరాలు తెలుసుకున్నారు. గ్రామాల్లో రైతుల సమస్యలను పరిష్కరించడానికీ చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో రీ-సర్వే డిప్యూటీ తహసీల్దార్ నారాయణస్వామి, ఆర్ఐ బషీరున్, వీఆర్వోలు తాతయ్య, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

పది టాపర్‌కు ప్రోత్సాహక బహుమతి


విద్యార్థినికి రూ.10వేలు అందిస్తున్న దృశ్యం

యాడికి: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది 10వ తరగతిలో టాపర్‌గా నిలిచిన దేదీప్య (581 మార్కులు) అనే విద్యార్థినికి గురువారం రూ.10 వేలను అందజేశారు. అలాగే పాఠశాలలో విద్యార్థుల కోసం వాటర్ ట్యాంకు అందించారు. కరోనాతో మృతిచెందిన జూనియర్ అసిస్టెంట్ అజయ్ బాబు జ్ఞాపకార్థం అతడి మిత్రులు పాఠశాల అభివృద్ధికి, పదో తరగతి విద్యార్థికి ఆర్థిక సాయం అందించటం అభినందనీయమని హెచ్‌ఎం సీతారామాంజనేయులు, ఉపాధ్యాయులు తెలిపారు.

105 మందికి వైద్య పరీక్షలు


రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

యాడికి: మండల కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో గురువారం ముక్కు, గొంతు, చెవి సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న 105 మంది వైద్య పరీక్షలు నిర్వహించారు. తాడిపత్రికి చెందిన శ్రీరాగ చరిత ఈఎన్‌టీ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యుడు జస్మిత్ రెడ్డి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆదిత్య పవన్, రవితేజ, కేదార్ నాథ్, నితిన్, లక్ష్మీనారాయణ, విశ్వనాథ్, బంగారు బాల పాల్గొన్నారు.


మరమ్మతులకు నోచుకోని ఆర్‌ఓ డ్రింకింగ్ వాటర్ ట్యాంక్

నిరుపయోగం..

గుంతకల్లు టౌన్: మున్సిపల్ కార్యాలయంలో ఉద్యోగులు, ఆఫీసుకు వచ్చే ప్రజలకు శుద్ధమైన తాగునీటిని అందించాలనే ఉద్దేశంతో వేలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఆర్‌ఓ వాటర్ ట్యాంక్ నిరూపయోగంగా మారింది. చిన్నపాటి మరమ్మత్తుల కారణంగా ఆర్‌ఓ వాటర్ ట్యాంక్‌ను వినియోగించట్లేదు. అంతేకాకుండా వాష్‌రూమ్ వెళ్లొచ్చిన తరువాత చేతులు శుభ్రం చేసుకోవడానికి మెప్మా వారు ఏర్పాటు చేసిన నీటి ట్యాంకు కూడా నిరుపయోగంగా మారింది. ఉదయం లేవగానే స్వచ్ఛత గురించి మాట్లాడే అధికారులు కార్యాలయ ఆవరణలోనే ఆ ట్యాంకుల చుట్టూ చెత్తాచెదారం, దుమ్ముధూళి పేరుకుపోయినా పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా అధికారులు మరమ్మత్తులు చేయించి ట్యాంక్‌లను వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది.

ప్రమాదకరం..

గుత్తి రూరల్: మండలంలోని చెర్లోపల్లిలో సేవాగఢ్‌కు వెళ్లే దారిలో విద్యుత్ తీగలు ఇళ్ల స్థలాలపై నుంచి వెళ్లి ప్రమాదకరంగా మారాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామ శివారులో అనేక మంది నూతన గృహాలు నిర్మించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఇళ్ల స్థలాలపై నుంచి 11 కేవీ విద్యుత్ తీగలు వెళ్లడంతో ఇబ్బందిగా ఉందని గ్రామస్తులు వాపోయారు. సేవాగఢ్, పూలకుంట, గుంతకల్లు మండలాల్లోని కొన్ని గ్రామాలకు కరెంట్ సరఫరా చేసే విద్యుత్ తీగలు తమ స్థలాల మీదుగా వెళ్లడంతో గృహాలు నిర్మించేందుకు బేల్దారులు ముందుకు రావడం లేదన్నారు. విద్యుత్ తీగలు మార్చాలని గతంలో పలుమార్లు అధికారులను కోరినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా ట్రాన్స్‌కో అధికారులు స్పందించి తమ ఇళ్ల స్థలాల మీదుగా వెళ్లిన 11 కేవీ విద్యుత్ తీగలను తొలగించాలని గ్రామస్తులు కోరారు.


ఇళ్ల స్థలాలపై నుంచి ప్రమాదకరంగా వెళ్లిన విద్యుత్ తీగలు


శిథిలావస్థకు చేరిన రిక్షాలు

నిర్లక్ష్యం..

తాడిపత్రి రూరల్: పట్టణ సమీపంలోని గన్నెవారిపల్లి పంచాయతీలోని కమ్యూనిటీ హాలులో చెత్తను సేకరించే రిక్షాలు మూలన పడ్డాయి. అధికారులు వాటిని మరమ్మతు చేయించకుండా మూలన పడవేశారు. చెత్త వాహనాలు మూత పడటంతో ఇంటింటి చెత్త సేకరణలో కార్మికులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దీంతో గన్నెవారిపల్లి కాలనీలో రోజూ చెత్తను సేకరించడంలో జాప్యం జరుగుతోంది. చెత్త సేకరణలో జాప్యం వల్ల ఎక్కడ పడితే అక్కడ చెత్త కనిపిస్తోంది. అధికారులు స్పందించి రిక్షాలను వినియోగంలోకి తేవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

సృజనాత్మకతకు సువర్ణ అవకాశం


మాట్లాడుతున్న గేట్స్ ఎండీ రఘునాథ్ రెడ్డి

గుత్తి: కేంద్ర ప్రభుత్వం ఎంఎస్ఎంఈ ఐడియా హ్యాకథాన్ 5.0 నిర్వహిస్తోందని సృజనాత్మక ఆలోచనల ఉన్న వారికి ఇది సువర్ణావకాశమని గేట్స్ ఎండీ రఘునాథ్ రెడ్డి అన్నారు. గుత్తి గేట్స్ ఇంజినీరింగ్ కాలేజీలో గురువారం ఆయన మాట్లాడుతూ హ్యాకథాన్ 5.0 కార్యక్రమానికి సంబంధించిన అంశాలను వివరించారు. 18 నుంచి 60 సంవత్సరాలు మధ్య ఉన్న ఆవిష్కర్తలు కార్బన్ ఫుట్‌ప్రింట్ టెక్నాలజీ, సర్వేలైన్ మరియు సైబర్ డిఫెన్స్ టెక్నాలజీ, ఇన్నోవేషన్ ఇన్ ఎకోసిస్టమ్స్, కోస్టల్, హిల్లీ రీజియన్స్, బిజినెస్ ఆఫ్ గ్రేడింగ్, స్మార్ట్, రెసిలియంట్ సప్లై చైన్ వంటి అంశాలపై ప్రతిభను ఆవిష్కరణల రూపంలో చూపవచ్చునన్నారు. గతంలో అంటే హ్యాకథాన్ 4.0 లో గేట్స్ విద్యార్థులు ఎంఎస్ఎంఈ గేట్స్ వెబ్ సైట్ ను సందర్శించి ఐడియాలను(నూతన ఆవిష్కరణలు) సమర్పించి రూ. 15 లక్షలు, రూ. 7 లక్షలు నిధులు సాధించారన్నారు. మంచి ఆవిష్కరణలకు గరిష్టంగా రూ. 15 లక్షల దాకా ఆర్థిక సహాయం లభిస్తుందన్నారు. గేట్స్ వెబ్ సైట్‌ను సందర్శించి ఆవిష్కరణలు చేయవచ్చునన్నారు. ఔత్సాహికులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రమాదంలో ఏఎస్ఐకు గాయాలు

గుత్తి: స్థానిక కర్నూలు రోడ్డులో కొండారెడ్డి పిండి మిషన్ సమీపంలో చోటు చేసుకున్న ప్రమాదంలో ఏఎస్ఐ నాగమాణిక్యం గాయపడ్డారు. గురువారం ఉదయం పీఎస్ నుంచి ద్విచక్ర వాహనంపై అనంతపురం వైపుగా బయలుదేరిన ఆయన కొండారెడ్డి మిషన్ వద్దకు చేరుకోగానే రోడ్డుకు అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించబోయి కిందపడ్డారు. ఘటనలో గాయపడిన నాగమాణిక్యంను స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు.

గడ్డివామికి నిప్పు

యల్లనూరు: మండలంలోని చింతకాయమంద గ్రామానికి చెందిన రైతు శ్రీరంగ గడ్డవామికి బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఐదెకరాల పొలంలోని వరి గడ్డి పూర్తిగా కాలిపోవడంతో రూ.లక్షకు పైగా నష్టం వాటిల్లిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. అధికారులు స్పందించి ఆదుకోవాలని కోరాడు. ఈ పనిని గుర్తుతెలియని వ్యక్తులు చేశారా.. లేక ఇంకా ఎవ్వరైనా చేశారనే అనుమానంతో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

ఆటో డ్రైవర్‌పై దాడి


గాయపడిన జయరాముడు

గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేట గ్రామ శివారులో స్పందన ఫంక్షన్ హాల్ సమీపంలో ఆటో డ్రైవర్ జయరాముడుపై మధ్యాహ్నపు శ్రీనివాసులు అనే వ్యక్తి దాడి చేసి గాయపరిచాడు. పోలీసుల వివరాల మేరకు... వన్నేదొడ్డి గ్రామానికి చెందిన వారు బుధవారం రాత్రి మొహర్రం పండుగ చందా విషయంలో వాగ్వాదం చేసుకున్నారు. అక్కడ పెద్దలు సర్ది చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. ఈ క్రమంలో గురువారం అరేటి జయరాముడు తాడిపత్రి రోడ్డులో ఆటోలో వెళ్తుండగా మనసులో పెట్టుకున్న మధ్యాహ్నపు శ్రీనివాసులు ఆటోను ఆపి దాడి చేశాడు. రాళ్లతో దాడి చేయడంతో జయరాముడు తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే అతడిని గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సలకు అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సందడిగా మొహర్రం వేడుకలు


బుక్కరాయసముద్రం మండలం గోవిందపల్లిలో కొలువు తీరిన పీర్లు


గుంతకల్లులోని రామస్వామి గుడి వీధిలో పూజలందుకుంటున్న పీర్ల స్వాములు


గుత్తిలో కొలువుదీరిన బారే హిమామ్ పీర్లు


గుత్తిలోని కోటలో పూజలందుకుంటున్న పగ్గాల పీర్లు


పెద్దవడుగూరులో పీర్లు


పెద్దపప్పూరు మార్కెట్‌లో కొలువుదీరిన పీర్లు

గుంతకల్లు: పట్టణంలో పలుచోట్ల మొహర్రం వేడుకలు సందడిగా సాగుతున్నాయి. పాతూరు, రామస్వామి గుడి వీధి, తిలక్‌నగర్, పాతగుంతకల్లు, తిమ్మనచర్ల, భాగ్యనగర్, సత్యనారయణపేట తదితర ప్రాంతాల్లో హిందువులు, ముస్లింలు పండుగను ఘనంగా జరుపుకుంటున్నారు. మొహర్రం వేడుకల్లో భాగంగా 4వ తేదీ చిన్న సరిగెత్తు, 5న విడిదినం, 6వ తేదీ పెద్ద సరిగెత్తు, 7వతేదీ ఉదయం పీర్ల అగ్నిగుండా ప్రవేశం, గ్రామోత్సవం నిర్వహించిన అనంతరం సాయంత్రం జలధి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ముజవర్లు తెలిపారు. ఈ సందర్భంగా భక్తులు మొక్కుబడిలో భాగంగా పీర్లను సందర్శించి చక్కెర చదివించారు.

గుత్తి: గుత్తి, గుత్తి ఆర్ఎస్‌లలో పీర్ల మకాన్‌లలో పీర్లు కొలువు దీరాయి. వాసవీ బజారులో బారే హిమామ్ పీర్లు, కోటలో బొడ్డు పీర్లు, జెండా వీధిలో పగ్గాల పీర్లు, కటిక బజారులో చందమామ పీర్లు కొలువుదీరాయి. పీర్ల మకాన్‌లలో ముజావర్లు ప్రార్థనలు చేశారు. భక్తులు చక్కెర చదివించారు. పీర్ల మకాన్ వద్ద ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. కాగా శుక్రవారం చిన్న సరిగెత్తు నిర్వహించనున్నారు.

బుక్కరాయసముద్రం: మండలంలోని గోవిందపల్లి, బీకేఎస్, పొడరాళ్ల, రెడ్డిపల్లి, వెంకటాపురం, చెన్నంపల్లి, బొమ్మలాటపల్లి, జంతలూరు, తదితర గ్రామాల్లో మొహర్రం వేడుకలు నిర్వహిస్తున్నారు. 5వ తేదీ చిన్న సరిగెత్తు, 7న పెద్ద సరిగెత్తు, 8న పీర్లు జలధికి తీసుకెళ్లనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పెద్దవడుగూరు: మండలంలోని గ్రామాల్లో మొహర్రం పండుగను పురస్కరించుకొని గ్రామ చావిడిలో పీర్లు కొలువు దీరాయి. ఈ సందర్భంగా స్వాములను రంగు రంగుల వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వాములను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పెద్దపప్పూరు: మొహరం సందర్భంగా మండలకేంద్రంలోని మార్కెట్‌లో పీర్లస్వాములు వెలిశాయి. గురువారం భక్తులు పీర్ల స్వాములకు చక్కెర, బెల్లం చదివించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఎన్నికల హామీలు వెంటనే అమలు చేయాలి



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి జాఫర్

గార్లదిన్నె: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ డిమాండ్ చేశారు. గురువారం గార్లదిన్నెలో సీపీఐ మండల కార్యదర్శి వన్నూర్ స్వామి అధ్యక్షతన ఏడో మండల మహాసభలు నిర్వహించారు. కార్యక్రమంలో జాఫర్‌తోపాటు జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. మొదటగా తహసీల్దార్ కార్యాలయం నుంచి వెంకటేశ్వర స్వామి కల్యాణ మండపం వరకూ ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మహాసభలో జాఫర్ మాట్లాడుతూ ప్రధాని మోదీ అనుసరిస్తున్న మితవాద, మతోన్మాద, కార్పొరేట్ విధానాలను కమ్యూనిస్టులుగా వ్యతిరేకిస్తున్నామన్నారు. దేశంలో వ్యవసాయం సంక్షోభంలో పడిందన్నారు. పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. దేశంలో నిరుద్యోగుల సంఖ్య పెరిగిందన్నారు. అనంతరం సీపీఐ నూతన మండల కమిటీ ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా రాముడు, సహాయ కార్యదర్శిగా వన్నూరుస్వామి, రామక్రిష్ణ, కౌన్సిల్ సభ్యులు గా 21 మంది ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు శ్రీనాథ్ చౌదరి, రామాంజనేయులు, చౌడప్ప, శర్మాస్‌వలి, జగన్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజు దోపిడీ అరికట్టాలి


ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

పామిడి: ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీ అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ గుంతకల్లు నియోజకవర్గ అధ్యక్షుడు వి.వినోద్ డిమాండ్ చేశారు. గురువా స్థానిక ఎంఈఓ-1 జయానాయక్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. పామిడిలో ప్రైవేట్ పాఠశాలల యజమానులు ఇష్టారాజ్యంగా పిల్లల తల్లిదండ్రుల నుంచి ముక్కుపిండి ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. ఏ ప్రైవేట్ స్కూల్‌లోనూ ఫీజు స్ట్రక్చర్ నిర్వహించన పాపాన పోలేదన్నారు. పర్మిషన్లు లేకుండా, రెన్యూవల్ చేయకుండా నిర్వహిస్తూ విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్న మండలంలోని ప్రైవేట్ పాఠశాలలపై వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. లేనిపక్షాన ఉద్యమించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల నాయకులు, చింటూ, వినయ్, మల్లి తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయాలి

పామిడి: సీఎం చంద్రబాబు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు పరచాలని సీపీఐ మండల శాఖ నాయకురాలు సారాంబి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పీర్ల మకాన్ వద్ద ఏర్పాటు చేసిన మహిళా సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళలకు తక్షణం ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలన్నారు. అర్హులైన మహిళలందరికీ నెలకు రూ.1500లు ఇస్తామన్న హామీని నిలబెట్టుకోవాలన్నారు. డ్వాక్రా మహిళా సంఘాల రుణాలను మాఫీ చేయాలన్నారు. అర్హులందరికీ నివేశస్థలాల మంజూరుతో పాటు రూ.5 లక్షల రూపాయలతో ఇంటి నిర్మాణం చేపట్టేందుకు నిధులు కేటాయించాలన్నారు. గతంలో మాదిరిగానే వృద్ధులకు, వికలాంగులకు ఇంటివద్దకే వచ్చి రేషన్ పంపిణీ చేపట్టాలన్నారు. లేనిపక్షాన మహిళలంతా సంఘటితమై పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి


యాడికిలో ర్యాలీ చేస్తున్న దృశ్య

యాడికి: డెంగీపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు సూచించారు. గురువారం యాడికి ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారులు పరమేశ్వర, సుమంత్‌రెడ్డి, తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు డెంగీ మాసోత్సవం సందర్భంగా ప్రభుత్వాస్పత్రి నుంచి బస్టాండు, వైఎస్సార్ సర్కిల్, కోన రోడ్డు వరకూ ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. శ్రీనివాసులు మాట్లాడుతూ డెంగీ రాకుండా ప్రతిఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటి చుట్టూ వ్యర్థమైన కొబ్బరి చిప్పలు, పాడైన టైర్లలో నీరు నిల్వ లేంకుడా చూసుకోవాలన్నారు. ప్రత్యేకంగా ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. జ్వరం వస్తే వెంటనే సమీపంలోని ప్రభుత్వాస్పత్రిలో వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాలిక ఆచూకీ లభ్యం

పెద్దపప్పూరు: మండలంలోని ఓ గ్రామానికి చెందిన సెకండ్ ఇయిర్ చదువుతున్న బాలిక ఆచూకీ లభించినట్లు సమాచారం. తమ కూతురు కనిపించడంలేదని తల్లిదండ్రులు పది రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం పాఠకులకు తెలిసిందే. పోలీసులు దర్యాప్తు చేపట్టి అదృశ్యమైన మైనర్ బాలికను సెల్‌ఫోన్ ఆధారంగా గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా విశ్వసనీయ సమాచారం మేరకు.. ప్రేమ పేరుతో పెద్దపప్పూరు గ్రామానికి చెందిన హేమంత్ అనే యువకుడు బాలికను తీసుకువెళ్లినట్టు సమాచారం. మైనర్ బాలిక అదృశ్యంపై సీఐ రామసుబ్బయ్యను సాక్షి ప్రశ్నించగా బాలిక ఆచూకీ లభ్యమైందని, ప్రస్తుతం బాలిక పోలీసులు అదుపులో ఉందని ఆయన సమాధానమిచ్చారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి


అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

బుక్కరాయసముద్రం: ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ విద్యార్థులు చిన్న వయస్సులో మత్తు పదార్థాలకు బానిక కాకూడదన్నారు. బీడీలు, సిగరెట్లు, మందు తాగడం వలన ఆరోగ్యం చెడిపోతుందన్నారు. మత్తు పదార్థాలు ప్రాణాంతకమన్నారు. వీటి వలన కుటుంబాలు చిన్నాభిన్నమైపోతాయన్నారు. జూలై 1 నుంచి 21వ తేదీ వరకు పొగాకు వ్యతిరేకంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వసుంధర, జిల్లా పొగాకు నియంత్రణ సోషల్ వర్కర్ శ్రీరాములు, సూపర్‌వైజర్లు సత్యనారాయణశాస్త్రి, విజయలక్ష్మి, ధనుంజయ, ఆది నారాయణమ్మ, భారతి, సునీత, వాణి పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన బొంబాయి రమేష్ నాయుడు


వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో బొంబాయి రమేష్ నాయుడు, ఆయన సోదరుడు వెంకటనాయుడు

యాడికి: మండల కేంద్రంలోని సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకుడు బొంబాయి రమేష్ నాయుడు గురువారం తన తమ్ముడు, ఎంపీటీసీ సభ్యుడు వెంకటనాయుడుతో కలిసి విజయవాడలోని తాడేపల్లికి వెళ్లి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జగనన్న తాడిపత్రి నియోజక వర్గంలోని రాజకీయాలపై బొంబాయి రమేష్ నాయుడును అడిగి తెలుసుకున్నారు. మండలంలో ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కారానికి కృషి చేయాలని జగన్‌మోహన్ రెడ్డి సూచించారు.

ప్రతి కార్యకర్తనూ కాపాడుకుంటాం


జగన్‌మోహన్‌రెడ్డితో రేవతి

తాడిపత్రిటౌన్: ప్రతి కార్యకర్తకూ అండగా ఉండి కాపాడుకుంటానని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హమీ ఇచ్చారని తాడిపత్రి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ మహిళా అధ్యక్షురాలు రేవతి తెలిపారు. గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యాలయంలో ఆమె వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. ఇటీవల తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి తనపై బెదిరింపు ధోరణిలో చేసిన వ్యాఖ్యలను జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు ఆమె తెలిపారు. ప్రతి కార్యకర్తకూ పార్టీ అండగా ఉంటుందని నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని జగన్ ఆదేశించారన్నారు.

6న దంత వైద్య శిబిరం

పామిడి: పట్టణంలోని కన్యకా పరమేశ్వరీ మాతా కల్యాణ మండపంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అనంతపురంలోని ప్రఖ్యాత్ డెంటల్ హాస్పిటల్ సౌజన్యంతో ఈ నెల 6న ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆక్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రభుత్వ ఆయూష్ సీనియర్ వైద్యాధికారి నల్లపాటి తిరుపతినాయుడు, అధ్యక్షుడు కె.రఘువీర్ గురువారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. అవకాశాన్ని మండల, మండలేతర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదనపు సమాచారం కోసం 9440550000, 9866589899 నంబర్లలో సంప్రదించాలన్నారు.